# విద్యార్థి లోకంలో....

* శ్రీ కోటంరాజు జనార్ధనరావు బి. ఎస్‌సి. *

ఆ నాటినుంచి పరీక్షలకు చదువు ప్రారంభిద్దామనుకున్నారు ఆ మిత్రత్రయం—రమేష్, పరేశ్, జగదీశ్. రాత్రి ఎనిమిది గంటలకు వేసే ఫిరంగితో సరస్వతీ ప్రార్థనతో పాఠ్యపుస్తకాల పఠనం ప్రారంభిద్దామనుకున్నారు. సరే! ముందుగా చదువుకు అనుకూల వాతావరణాన్ని సమకూర్చుకోవాలని ఆలోచించుకున్నారు. అందుకని ఒకడు పూర్వం రమేష్ సంపాదించిన కుర్షీద్ ఫోటో స్థానాన్ని సరస్వతిదేవి పటాన్ని నెలకొల్పి, మల్లెపూలదండ వేసాడు. రూము అంతా పడివున్న మాసిపోయిన బట్టలను, మాగజైనులను, నవలలు వగైరా అమాంబాపతును తీసివేసి రూమును శుభ్రపరచారు. ఆనాడు పనిచేసేమనిషి రాకపోతే కిటికీలు, తలుపులు వేసుకొని ఎవరు చూడకుండా తామే గదిని ఊడ్చుకున్నారు. ఏదోవిధంగా శ్రమపడి రూముకు ఒక నూతన శోభను తీసుకువచ్చారు. రాత్రిచాలసేపు చదివేసరికి ఆకలివేస్తుందని మిఠాయి, వేడిచేయకుండా చక్రకేళీలు బజారుకెళ్ళి పట్టుకువచ్చాడు జగదీశ్. ఆ నాడు వేసుకున్న టైంటేబుల్ ప్రకారం కావలసిన పుస్తకాలను రమేష్ టేబుల్‌మీదపెట్టి హోటలుకు భోజనం చేయడానికి వెళ్లాడు.

అసలు ఈసందర్భంలో వ్యాళ్ళనుగురించి చెప్పడం అవసరం. వాళ్ళు ముగ్గురు లాకాలేజిలో చదువుతున్నారు. అందరూ బ్రహ్మచారులే. ఇందులో రమేషు, ఒకనటుడు, ఫైన్‌ఆర్ట్‌స్ అంటేపడి చస్తాడు. అతని నటనాకౌశలానికి చాలబహుమానాలు కూడావచ్చాయి. ఏ బళ్ళారి రాఘవచారి అంతోఅయ్యి. ఒక పెద్దనాటకం కంపెనీనినడిపి, దాంట్లోకిచదువుకున్న స్త్రీ పురుషులను చేర్చాలని రమేష్ ఆశయం. ఇక పరేష్ ఒకప్రేమజాలి, శాస్త్రచోరుడచేపుకొని, అవకాశంవుంటే ఆడవాళ్ళతో స్నేహంచేస్తూవుంటాడు.

ఇక జగదీష్ ఒకరచయిత. తనజీవితంలో ఏ రవీంద్రనాథ్ టాగూర్, అంతోలేక శరత్‌బాబు అంతకవినో అవ్వాలని అతనిఆశయం. అందుకని టాగూర్, శరత్ ఫోటోలను సంపాదించి రూములోతగిలించాడు. ఏదైనా కథను వ్రాయపూనేటప్పుడు ఆ ఫోటలవంకనిర్నిత నేత్రాలతో చూచి కథవ్రాయడం ప్రారంభిస్తాడు. ఏదెట్లావున్నా జగదీష్ వ్రాసిన కథలచిత్తుగావుండాగానే మిత్రులకు చదివి వినుపిస్తూ వుండేవాడు. రమేష్ పరేష్‌లకు, జగదీశ్ వ్రాసిన కథలన్నీ దాదాపు నోటికి వచ్చునని చెప్పవచ్చును. ఇంకొకవిశేషముంది! ఏ రాత్రో తెల్లవారుఝామునవో లేచికూర్చొని వ్రాస్తూవుండేవాడు. జగదీశ్, లైటువేసుకొని "ఒరేయి, లైటు ఆర్పరా నిద్రపట్టడంలేదు" అని మిగిలిన ఇద్దరుగోలపెడుతే "ఉండండిరా మంచిథియోరి వచ్చింది" అని వ్రాస్తూవుండేవాడు. అట్లా ఒక గంట తెల్లకాగితాలు నలుపుచేసి, చివరకూ వ్రాసినవన్నీ చింపి "పోండిరా! ఐడియా అంతా డిస్‌ట్రబ్ చేశారు" అంటూ లైటుఆర్పి ప్రక్కమీద చేరేవాడు. "బ్రతికాంరా బాబూ" అనుకొని మిగిలిన యిద్దరూఠగ్గులు కప్పుకునేవాళ్ళు—. అదిగో! అటువంటి రకం ఆ ముగ్గురు.

ఆ ముగ్గురు ఆర్టిస్టులు ఒక రూములో వుంటూన్నారు. ఎంత అందంగావుంటుందో చూడండి. వాళ్ళ వాళ్ళ అభిరుచులను గురించిమాట్లాడుతూ, వాదిస్తూ, పోట్లాడుతూ, సంవత్సరమంతా గడిపివేశారు ఆ మిత్రత్రయం. పరీక్షలు దగ్గరకువచ్చాయి అనేసరికి, కాస్త వాళ్ళకు ప్యాసు అవ్వాలనే కోరికగలిగింది. ఆ కోరికకైన పెద్దకారణం. తమ పేర్లచివర డిగ్రీలను తగిలించుకోవచ్చునసే వ్యామోహమమే!

హోటలుకు భోజనానికివెళ్ళిన రమేష్ వస్తూ, బజారునుంచి కొబ్బరికాయ, అగరువత్తులు తీసుకు

వచ్చాడు. ధూపదీప నైవేద్యాదులతో చదువు ప్రారంభిద్దామని. అప్పటికేయింకా పరేష్‌రాలేదు. జగదీశ్ యింతకుపూర్వమే వచ్చాడు. రమేష్ జగదీశ్ నియమిత కుర్చీలమీదకూర్చుని, ప్రేమాపిపాసి పరేష్‌కోసం ఎదురు చూస్తున్నారు. ———ఫిరంగిపేశారు—ఊహు! పరేష్ రాలేదు. వాళ్ళిద్దరికే అంతవరకున్న ఓర్పు కూడ పోయింది. పోనీ దైవప్రార్థన పూర్తిచేసివుంటే, పరేష్ రావడంతోనే చదువు ప్రారంభిద్దామని, కొబ్బరికాయ కొట్టి, అగరువత్తులను వెలిగించారు. ఈ అగరువత్తులపొగ రూమంతా వ్యాపించి, ఈవిచిత్రద్రవ్యానికి దైవప్రసాదమయిన కొబ్బరిముక్కలను తినాలని కోరికను కలిగించాయి. ఆ కోరికను అమలులోకి జరుపదలచారు. కొబ్బరిలోకి బెల్లంవుంటే బాగుంటుందనిపించింది. వెంటనే అరఫర్లాంగు దూరంలోవున్న కొట్టుకు ఉత్తరాయం వేసుకుని జగదీశ్ పరుగెత్తాడు. ఈ లోపల రమేష్ ఆ కొబ్బరినికొట్టి చాకుతో సమభాగాలుగాచేసి, కాగితంమీద పేర్చాడు. జగదీశ్ రాగానే పరేష్‌భాగం విడిగాపెట్టి, ఈయిరువురు ఆరగించడం ప్రారంభించారు.

క్రిందటిరాత్రే, ఈ నాటినుంచి చదువు ప్రారంభిద్దామని, సినిమాకువెళ్ళారు. ఈ కొబ్బరి, బెల్లం కన్‌టిన్యుయోషన్‌తో నిన్నటి హీరోయిన్ జ్ఞప్తికివచ్చింది. హీరోయిన్ పాడలేదు, అది ప్లేబాక్ అని రమేష్,— కాదు ఆమెపాడగలదని జగదీశ్ వాదిస్తూ, వాదిస్తూ, పరేష్‌కు జాగ్రత్తగా వుంచబడిన కొబ్బరి, బెల్లంకూడ తినేశారు. తరువాత జ్ఞప్తికివచ్చి నాలికకొరుకున్నారు. అప్పటికే యింకా పరేష్‌రాలేదు. తొమ్మిది అవవొస్తోంది.

అంతరంగికంగా ఆనాటికి చదవవలసిన బాధ తప్పినందుకు యిద్దరు సంతోషిస్తున్నా, బైటికి పరేష్‌ను దూషించడం ప్రారంభించారు. అతనురాగానే గట్టిగా చీవాట్లు పెడుదామనుకున్నారు. — పోనీ తామన్నా చదువు ప్రారంభిద్దామని ముందు అనుకున్నారు. కాని కష్టసుఖాలలో పాలుపంచుకునే పరేష్‌రానిదే, తాము చదువ ప్రారంభించడం నచ్చలేదు. ఏ స్నేహితుడు, మిత్రద్రోహం చేయడానికి తలపెడ్తాడు చెప్పండి. అందులో ఆవిషయంపై జగదీశ్ చాలకథలుకూడ వ్రాసివుండె—. కాని ఒకటి మాత్రం చేద్దామనుకున్నారు. అనుకున్న టైంకురానందుకు, పరేష్‌కు జరిమానాగా, యింతకు పూర్వం తెచ్చిన మిఠాయి- చక్రకేళీలు తినివేద్దామనుకున్నారు.

* * *

తొమ్మిది తరువాత అరగంట కొడ్తూండగా పరేష్ రొజుకుంటూ రూములోనికి వచ్చాడు' వస్తూనే 'బయలుదేరండిరా పోదాం'' అని తొందరచేయుడం మొదలుపెట్టాడు. ఏమిట్రా! అసలు సంగతేమిటి అని అడిగారు రమేష్, జగదీశ్. చెప్తా! పదండి సినిమాకు అని మిగిలిన యిద్దరినీ బలవంతంగా లేవదీసాడు పరేష్ ఏదో విశేషం వుండందే అంత తొందర చేయడని మిగిలిన యిద్దరు అనుకొని బయలుదేరడానికి అంగీకరించారు. ఈవిఘ్నానికి క్షమించమని సరస్వతీ దేవికి నమస్కరించి రూముకు తాళంవేసి బయలుదేరారు. ఆ పటంలోవున్న సర్వతీదేవి నవ్వుతుంది వాళ్ళ దీక్షను చూచి.

వెంటనే ప్రక్కనుంచి వెడుతున్న జట్కాను ఆపి ఎక్కారు. జట్కా వేగంగా పరుగెత్తడానికి ప్రయత్నిస్తోంది. అందరూ ఒకనిముషం మౌనంగా బండీలో కూర్చున్నారు.

ఒరేయి! అసలు నీబాధ ఏమిట్రా అని అడిగాడు రమేష్ చిఱునవ్వునవ్వి ఉషారుగా చెప్పడంప్రారంభించాడు.

మధ్యాహ్నం వాళ్ళ క్లాసుమేటు ఒంటరిగా రూములో కూర్చునివుందట. తనకు ఆమెను చూచేసరిక ఎందుకనో పలుకరించాలని కోరిక కలిగిందట. వెంటనే లోపల కొద్దిగా భయంగావున్నా, వైటింగ్ రూము వద్దకు వెళ్ళి నమస్తె అన్నాడట. ఆ అమ్మాయి తెల్లబోయి లేచి నమస్తె అని ప్రతినమస్కారం చేసిందట. ఆట్లా ఒకనిముషం యిరువురు ఆగిపోయారట. బహుశా ఆ వొక్కనిముషం వాళ్ల కళ్లు మాట్లాడుకొని వుంటాయట. తరువాత తనకు క్లాసునోట్సు కావాలని అడిగాడట. ఆమె అభ్యంతరం చెప్పకుండా నోట్సు యిచ్చిందట. అసలు ఆ నోట్సు ఆ అమ్మాయి పలు

కరిద్దామనే తీసుకున్నాడట. ఆ సంతోషంలో ధ్యాంక్సు అనటంకూడ మరచిపోయి బయట వచ్చేసాడట. ఆవిసురులో మా వూళ్ళోవున్న పార్కుకు వెళ్ళి కూర్చున్నాడట. ధ్యాంక్సు చెప్పకపోవండతో తన్ను సభ్యత తెలియని మనిషిగా భావిస్తుందనే విచారంతో. అక్కడే చాలసేపు కూర్చున్నాడుట. అక్కడి ప్రకృతి సహజ సౌందర్యంకూడ తన్ను ఆకర్షించలేదు. అట్లా రాత్రి ఎనిమిది గంటలదాకా, ఆమెకు ఏవిధంగా ధ్యాంక్సు అందచేయాలా అని ఆలోచిస్తూండగా ఫిరంగి వేసారట. వెంటనే జ్ఞాపకానికి వచ్చిందట వాళ్లు ఆనాటినుంచి తీవ్రంగా చదువుదామని తీర్మానించుకోవడం. వెంటనే బయలుదేరాడట, దోవలోనేవున్న ఆఅమ్మాయి యింటిమీదుగావస్తె, ఆమె కనపడుతే ధ్యాంక్సు అందచేయవచ్చుననే ఆశతో ఆ యింటి మీదుగా నెమ్మదిగా వస్తున్నాడట, ఆ యింటిలోపలనుంచి ఆరాత్రి ఫస్టు నారెండో ఆటకు వెళ్లాము అని వాళ్లు అనుకుంటున్నమాట వినిపించిందట. అందుకని యిప్పుడు తాముకూడ వెడుతే వీలుగావుంటే ధ్యాంక్సు చెప్పవచ్చునే ఆశతో బయలుదేరేశానని చెప్పాడు.

ఐతే! మళ్లీ ప్రేమవ్యాపారంలో సాగించడన్నమాట. సరే! స్నేహితునకు మద్దగా కిళ్లీలు వేసుకొని గోల్డుపాకు సిగరెట్లు వెలిగించి. రిజర్వ్డులోనికి వెళ్ళి కూర్చున్నారు. కాని విచారమయిన విషయం ఏమిటంటే ఆ అమ్మాయి అయితే వచ్చింది కాని ఆడవాళ్లలో కూర్చుంది. ఇటు ఆ అమ్మాయితో మాట్లాడేఅవకాశమూ దొరకలేదు. అటు చదువూ నాశనమయింది.

* * *

కాలాతీతం అయిపోవటంవలన ధ్యాంక్సు చెప్పడం ఇ సభ్యతగా వుండదని వూరుకోదలచారు ఆ మిత్రత్రయం. కాని యీ సంఘటన వాళ్ల జీవితక్రమంలో


నాణ్యము, ధర జంటగా కలసియుండును

కొనేవారు సరసమైన ధరయొక్క ఆకర్షణను ప్రతిఘటించవలయును.

ఏలయన అందులోనే కష్టముఉన్నది. ఒకటి లేక

రెండుపైసాల లాభముకొరకు, తక్కువ

ధరగల సరుకును కొన్నచో,

నాణ్యముయెుక్క విలువలో

ఒకటి లేక రెండు అణాలు నష్టము కలుగుచున్నది.

అందుచే ఇంగువలో
ఉత్తమమైనదానిని
జ్ఞప్తిలోఉంచుకొనండి

ఎల్. జీ. (L.G.)

నాణ్యమునకు, సరసమైన ధరకు ప్రఖ్యాతిచెందినది

ప్రతిచోటా దొరకును, లేక

లాల్ జీ గోధు అండు కో,

సావుకారుపేట మద్రాసు-1

హెడ్డాఫీసు : బొంబాయి ్రాంచి : కుంభకోణము.

# కోరతగినది




అందవతుల
ఆదరణ పొందినది

## పుష్కల హెయిరాయిల్

పుష్కల హెయిరాయిల్ మీరు వాడితే అది మీ కురులను అందపరిచి నిగనిగలాడు శిరోజములను దట్టముగా పెంచును అనేక శిరోజ వ్యాధులను రూపుమాపి శీఘ్రముగా వెండ్రుకలను వృద్ధిపరచును అది చల్లదనము కలిగించి మనస్సుకు ఆహ్లాదకరముగా వుండును. దాని మనోహరమైన సువాసన మిమ్ము ఆనంద పరిసరములలో నుంచును.

వ్యాపార భోగట్టాలకు వ్రాయండి:

దయా కాస్మెటిక్సు (ఇండియా) లి.
33 వెల్లాలవీధి, అమింజీకరై, మద్రాసు-10.





ఒకవిధమైన మార్పును తెచ్చింది. అదేమిటంటే రోజూ పార్కులో కూర్చునో, బజారుకెళ్లో కాలం గడుపుతూవుండే వాళ్ళు ప్రస్తుత. ప్రకృతి సౌందర్యాన్ని చూడడానికి అనే నెపంతో ఊరి అవతలకు షికారుకు మార్చారు, ఆ అప్సరసయిల్లు ఆదోవలోనే వున్నదని నేను వేరే చెప్ప నక్కరలేదనుకుంటాను.

అట్లా ఆ సుందరాంగి దర్శనార్థమై తిరుగుతూ ఆమె సినిమాకు వెళ్లినట్లు తెలుస్తె అదే సినిమాకు పరుగెత్తి ఆమె గుణగణాలనుగురించి వర్ణిస్తూ, రెండు మూడువారాలు గడిపివేసారు. నిరుత్సాహం ప్రబలుతోంది. ప్రవాహాన్ని యింకొక ముఖానికి త్రిప్పుతే ఈ నిరాశను కొంతవరకు మరచిపోగలమనుకున్నారు. మళ్లి చదువు ప్రారంభిద్దామని, సాయిబాబాకు ప్రీతైన రోజని, ఒక గురువారాన్ని నిర్ణయించుకున్నారు. పూర్వం చెప్పిన బడ్జెటు ప్రకారం తినుబండాలు వగైరాలు తయారు చేసుకున్నారు.

కాని, అనుకోకుండా పీక అవాంతరం వచ్చిపడింది రమేష్‌ను; కాలేజీ డ్రామాలో సెలెక్టు చేసుకున్నారు. హీరో వేశానికి. ఆడ్రామ కాలేజీ వాలిడిక్టరి ఫంక్షన్‌నాడు ఆడుతారట. ఇకనేం అతను. నాటకంపుస్తంతో పరుగెత్తుకవచ్చి; దస్తూరి బాగుంటే జగదీశ్‌ను పోర్షను వ్రాసి పెట్టమని బలవంతపెట్టాడు. ఈ రాత్రికి చదువు ప్రారంభిద్దాము. రేపు వ్రాస్తాము అని సణిగాడు జగదీశ్ ద్వితీయఃఘ్నం అసలు పనికిరాదు. రేపటినుంచి చదువు ప్రారంభిద్దాము. వ్రాయరా అని బలవంతపెట్టాడు రమేష్. ఆతినుబండారాలు ఆరగించినతరువాత జగదీశ్ శ్రద్ధగా పోర్షను వ్రాయడంప్రారంభించాడు.

సరే! ఆ నాటికీకూడ విద్యాదీక్షకు శుభలగ్నం కుదరలేదు. ఆమర్నాడుకూడ చదువు ప్రారంభించ లేదు—రాజ్ కమల్ వారి గొప్పచిత్రం రావడంవలన. ఆ మర్నాడేమిటి' ఆ కాలేజీ నాటకం వేసేదాకచదువు మొదలు పెట్టలేక పోయారు పాపం ఏం మొదలు పెడతారు! రమేష్ రోజూ తనపోర్షను యింట్లో అభినయంతో సహా బట్టీ పడుతూ మధ్య మధ్య షడ్జ మస్వరంలో పద్యాలూ పాటలూ పాడుతూంటే...!

నాటకం వేసారు. రమేష్ వేషం బాగా కృషి చేయడంవలన చాల బాగుంది. ఒకరజిత పతకాన్ని బహూకరించారు కాలేజీవారు. ఆ మెడల్ వచ్చిన ఉత్సాహంతోననండి, లేక గర్వంతోననండి. మిగిలిన యిద్దరూకూడ తమకే వచ్చినట్లుగా భావించి, క్రాప్ కటింగు క్రిందకు గింపి మావూళ్ళో తిరగడం మొదలు పెట్టారు.

* * *

ఇక పరీక్షలు మూడువారాలలోకి వచ్చేశాయి. ఇకనైనా దీక్షగా చదువు ప్రారంబిద్దామనుకున్నారు. కాని ఆశించిన ప్రకారమే మళ్లీ అవాంతరంవచ్చిపడింది రేడియోవారు ఉత్తమనాటికకు కొంత బహుమతి యిస్తారు అని ఆనోట ఆనోట జగదీశ్ విన్నాడు.

తనలోనూ వుత్సాహం వచ్చింది ఒక నాటికను వ్రాద్దామని. దానికితోడు మిగిలిన యిద్దరూ యితనిని ఉత్సాహపరిచారు. స్నేహితుల కోరికమీద నే ననండి లేక తన ఉత్సాహం వలన నే అనండి జగదీశ్ నాటికను వ్రాయ ప్రారంభించాడు. ఇతను వ్రాయడం. మిగిలిన యిద్దరూ చదివి భేష్ అనడమో లేక టెంపో చచ్చిందిరా, అని తిరిగి వ్రాయిడమో చేసి మొత్తంమీద అందరూకలిసి రెండుమూడు దస్తాల కాగితాలు చెడగొట్టినాటికను తయారుచేసి రేడియోకు పంపించారు.

ఈ నాటికా రచనతో కొద్ది రోజులు దొర్లి పోయాయి. ఇంకా పదిరోజులు మాత్రమే మిగిలాయి. ఇప్పుడు వాళ్ళకు ఓ అనుమానం వచ్చింది. అందరూ కలిసి అన్నిపుస్తకాలు చదువుతే టైంచాలదు కాబట్టి తలా కొన్నిచదివి, తాము చదివింది మిగిలినవారికి విశదీకరించుదామని తీర్మానించుకున్నారు. రూములో ముగ్గురూ మూడు కిటికీల వద్ద కుర్చీలు వేసుకుని చదవడం ప్రారంభించారు చాల సీరియస్‌గా. గట్టిగా అర గంట మాట్లాడుకుండా కూర్చోలేని ఘటాలు అట్లా గంటలతరబడి యేం కూర్చోగలరు, ఓ పావుగంటచదివి ఒకడు తన ప్రియురాలినిగురించి యిద్దరూ కసురుకుంటూరు. అతను ఫీల్ అయి పుస్తకంమీదకు తలవంచుతాడు. మళ్లీ యింకో పదినిముషాలు గడచిన తరువాత యింకొకడు తన కాలేజీ నాటకం, వేషం, మెడల్ గురించి చెప్పడం ప్రారంభిస్తాడు. రెండునిముషాలు తరువాత మిగిలినవాళ్ళ చేత చీవాట్లుతిని కోపంవచ్చి చదవ ప్రారంభిస్తాడు. ఇంకో అయిదునిముషాలు గడచిన తరువాత యింకొకడు తన రేడియో నాటికను అంగీకరించారో లేదోనని ఆవేదనను వోలకపోయ వస్తాడు. వాళ్ళు కేకలు వేస్తె ఇరిటేట్ అయి గదిలోనుంచి బయటకు వెళ్ళి మళ్లీ నిముషం తరువాత తిరిగివచ్చి చదవడానికి ప్రయత్నిస్తాడు.

మధ్య మధ్య సిగరెట్లుకు, ఇంకొకడు 'టి' కి ఇంకొకడు భోజనానికి వెళుతూంవుంటూరు. మధ్యలో బేతింగ్ బ్యూటి సినిమావస్తె వెళ్ళక తప్పలేదు మొత్తం మీద అ పదిరోజులు ఆపుస్తకాలముందు కూర్చుని రాత్రింబళ్లు జాగరణ చేసారు. చుట్టుప్రక్కలవాళ్లుకూడ వాళ్ళగదివంక చూచి ఎంత బుద్దిమంతులు, ఎంత కష్టపడి చదుకుంటున్నారు. అని అనుకుంటూ వుండేసారు.

సరే! పరీక్షలకు కూర్చున్నారు. ఏదో వ్రాసామంటే వ్రాసామనుకున్నారు, కాగితాలు నింపగలిగాము అన్నతృప్తి వాళ్ళలో పూర్తిగా ధైర్యాన్ని యిచ్చింది. తప్పక ప్యాసు అవుతాము అని టీపార్టి చేసుకొని, ఫోటో తీయించుకొని, ఆమిత్రత్రయం వేసంగి సెలవకు ఇళ్లకు వెళ్ళిపోయారు. పరీక్ష ఫలితాలుకోసం ఎదురు చూస్తున్నారు వాళ్లు ప్యాసు అవుతారంటూరా?